క్లుప్తంగా

సచివాలయం సందర్శన



ఉద్యోగులతో మాట్లాడుతున్న మురళీమోహన్‌కుమార్

సరుబుజ్జిలి: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో పీవీ మురళీమోహన్ కుమార్ అన్నారు. చినకాగితాపల్లి గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. వివిధ రికార్డులు, సిబ్బంది బయోమెట్రిక్ వివరాలు పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లే సిబ్బంది తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయంలో జాప్యం చేయవద్దన్నారు.

నేడు ఉర్లాంలో మెగా వైద్య శిబిరం

నరసన్నపేట: ఉర్లాం బీసీ వసతి గృహం ఆవరణలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభిస్తారన్నారు. నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షిస్తారన్నారు. శిబిరాన్ని ఈ ప్రాంతీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూడో పోటీల్లో తాడివలస విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: విజయవాడలోని మాంటిసోరి ఇండోర్ హాల్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభకనబర్చి పలు పతకాలు సాధించారు. మెట్ట చార్మి రజతం, మెట్ట చాందిని, కూన శివరామరాజు, వాకముల్లు కౌశిక్, కొత్తకోట నితిన్‌లు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం లభినేని హేమనాచార్యులు, వ్యాయామ ఉపాధ్యాయురాలు పైడి సునీత, ఉపాధ్యాయులు హరిప్రసన్న మంగళవారం అభినందించారు.

నేడు నైతిక విలువలపై పరీక్ష

హిరమండలం: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నైతిక విలువలపై పరీక్ష జరగనుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ తెలిపారు. విద్యార్థులు విధిగా పరీక్షకు హాజరు కావాలన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పాతపట్నం పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డైట్ అధ్యాపకుడు అప్పన్న

పాతపట్నం: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల ఎంఈవో సీహెచ్ మణికుమార్ అన్నారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని పెద్దలోగిడి, గంగువాడ, కొరసవాడ, సీది, రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మానిటరింగ్ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఓరియెంటేషన్ శిక్షణలో భాగంగా వమ్మరవల్లి డైట్ అధ్యాపకుడు అల్లు అప్పన్న ఆత్మస్థైర్యం, సానుకూల దృక్పథంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కుమారస్వామి, వల్లభరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



మాట్లాడుతున్న తహసీల్దారు సత్యనారాయణ

ఎల్.ఎన్.పేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని తహసీల్దారు బి.ఎస్.ఎస్.సత్యనారాయణ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్, సరుబుజ్జిలి ఎస్సై కె.సత్యనారాయణతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, కటౌట్లు తొలగించాలన్నారు.

రాజమ్మతల్లి విగ్రహావిష్కరణ

గార: వత్సవలసలో రాజమ్మ తల్లి విగ్రహావిష్కరణ మంగళవారం జరిగింది. దాసుడు మైలపల్లి శ్రీహరి (దాసు) స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కొర్ని సర్పంచ్ పీస గోపి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా..

- గర్భిణుల్లో రక్తహీనత నివారణపై దృష్టి
- సుఖప్రసవమయ్యేలా కృషి
- గర్భిణికి నాలుగుసార్లు వైద్య పరీక్షలు



రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

సరుబుజ్జిలి: మాతాశిశు సంరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా వైద్యసిబ్బందికి మరిన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. చాలామంది గర్భిణుల్లో రక్తహీనత కారణంగా ప్రసవాలు కష్టతరమవుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి వారిని ఆదుకునేందుకు అధికారులు దృష్టిసారించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు గర్భిణులు తనిఖీలు చేయించుకొని వైద్యుల సలహాల ప్రకారం వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదు కాబడిన గర్భిణులకు సుగర్, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఆమదాలవలస నియోజకవర్గంలో ఆరు నెలల్లో గర్భిణులకు వైద్య తనిఖీలు చేసిన వివరాలు ..			
మండలం	ఉపకేంద్రాలు	గర్భిణులు	బాలింతలు
సరుబుజ్జిలి	7	345	346
ఆమదాలవలస	15	546	411
బూర	7	367	389
పొందూరు	14	425	423

ప్రభుత్వం సూచించిన అంశాలు

- ఇప్పటివరకు గర్భిణులకు తొమ్మిది నెలల్లో మూడుసార్లు వైద్య తనిఖీలు చేసేవారు. ఇకపై ఈ సంఖ్యను నాలుగుకు పెంచారు.
- నాలుగోసారి చేసే వైద్య పరీక్ష విధిగా స్పెషలిస్ట్ వైద్యుల వద్ద మాత్రమే జరగాలి.
- గర్భిణిని వైద్య పరీక్షలకు తీసుకెళ్లే బాధ్యత ఏఎన్ఎంలకు అప్పగించాలి.
- గర్భిణికి రక్తంలో కనీసం 11 గ్రాముల హిమోగ్లోబిన్ తప్పనిసరిగా ఉండాలి. అంతకంటే తక్కువగా ఉంటే సంబంధిత ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త సలహాల మేరకు పౌష్టికాహారం తీసుకోవాలి. ఆకుకూరలు అధికంగా తీసుకొనేలా దృష్టిసారించాలి.
- ఏఎన్ఎంలకు కేటాయించిన పరిధిలో గర్భిణులు, బాలింతలకు వైద్యం అందించాలి. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తితోపాటు అంటువ్యాధులు ప్రబలకుండా వ్యాక్సినేషన్ సకాలంలో చేయించాలి.
- ఐసీడీఎస్ వారి సహాయ సహకారంతో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పాలు, గుడ్లు, చెక్కీలు అందించాలి. ఆకుకూరల వినియోగంపై అవగాహన కల్పించాలి.
- అవకాశం ఉన్నంతవరకు సుఖప్రసవాలు చేయించేలా డాక్టర్లు చర్యలు తీసుకోవాలి.
- సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో బర్త్ వెయిటింగ్ రూములు ఏర్పాటు చేయాలి. వీటిల్లో తల్లీబిడ్డ సుఖంగా ఉండేందుకు సదుపాయాలు కల్పించాలి.
- తల్లీబిడ్డ ఆస్పత్రిలో ఉన్నంతవరకు వారి యోగక్షేమాలు పర్యవేక్షించాలి. అనంతరం ఆస్పత్రికి కేటాయించిన వాహనంలోనే ఇంటికి చేర్చాలి.



బాలింతకు సపర్యలు చేస్తున్న వైద్యసిబ్బంది

అన్నిరకాల చర్యలు



మాతాశిశు సంరక్షణ కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. గతంలో కంటే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. ప్రసూతి సహాయం గతంలో కంటే ప్రభుత్వం పెంచింది.

– యండ భవ్యశ్రీ, వైద్యాధికారి, సరుబుజ్జిలి

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



నరసన్నపేట: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



సారవకోట: స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: పూజలు చేస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక వంశధార కాలనీలోని షిర్డీ సాయి ఆలయ 22 వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అర్చకులు జోష్యుల భాస్కరశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో నరసన్నపేటతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భాగస్వాములయ్యారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రామచంద్రాపురంలో..

సారవకోట: రామచంద్రాపురం గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. రొక్కం గురునాథరావు, వెంకటరమణ దంపతులచే ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చనలు, హోమాలు జరిగాయి. స్వామి వారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చిన్నాల వెంకట సత్యన్నారాయణ, పలువురు నాయకులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ చేపట్టారు.

ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో..

ఎల్.ఎన్.పేట: మోదుగువలస (చిన్నకొల్లివలస) పునరావాస కాలనీలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. పునరావాస కాలనీతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మండపారాధణ, హోమాది పూజల్లో పాల్గొన్నారని పురోహితులు భాస్కభట్ల వరప్రసాద్ శర్మ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ రెడ్డి రామారావు చెప్పారు. బుధవారం స్వామివారి కల్యాణం, తిరువీధి, అన్నసంతర్పణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

శ్రీముఖలింగంలో విద్యుత్ పనులు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సతీష్‌కుమార్

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయ ప్రాంగణంతోపాటు తలనీలాలు సమర్పించే గదిలో కూడా విద్యుత్ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో చేపట్టామని సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ కుమార్ అన్నారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ప్రారంభించారు. గతంలో లోవోల్టేజీ సమస్య ఉండేదని.. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో దాన్ని అధిగమించామన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రమణ

సారవకోట: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో ఎంవీ రమణ ఉపాధ్యాయులకు సూచించారు. కేశవలస ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. టీఏఆర్ఎల్ కార్యక్రమాన్ని రోజూ పక్కాగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు, టీచింగ్ నోట్స్ ప్రణాళిక మేరకు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు తెలుసుకున్నారు.

తర్లిలో గ్రామదేవత ఉత్సవాలు



ఘటాలతో వెళ్తున్న మహిళలు

సారవకోట: తొగిరి పంచాయతీ తర్లి గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత పాలమ్మ తల్లి ఆలయానికి గ్రామస్తులు ఘటాలతో వెళ్లి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ ప్రతినిధులు పాల ఆదినారాయణ, రాములు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా ఉండాలి

పాతపట్నం: అనాథలకు అందరూ అండగా ఉంటూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని నవజీవన్ ట్రస్ట్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న బధిర చిన్నారులకు ట్రస్ట్‌లో ఆశ్రయం కల్పించడం అభినందనీయమన్నారు. పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు



సైకిల్ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు తదితరులు

ఆమదాలవలస: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు అన్నారు. స్థానిక మోనింగివారి వీధిలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆరోగ్యంపై అవగాహన కోసం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక జీవన శైలిలో అదుపుతప్పిన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, వాతావరణంలో మార్పులతో లెక్కకుమించి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వీటికారణంగా భావితరాల భవిష్యత్తుకు ముప్పు పొంచిఉందన్నారు. వీటినుంచి బయటపడాలంటే వ్యాయామం, యోగా క్రమం తప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మీనారాయమణ, కె.వి.సుబ్రహ్మణ్యం, వైద్యురాలు డాక్టర్ నమ్రతారాయ్, హెచ్‌ఎం రమణమ్మ, ఉపాధ్యాయుడు గోపీకృష్ణ పాల్గొన్నారు.

పక్కా రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి

బూర్జ: మండలంలోని అయ్యవారిపేట గ్రామం నుంచి లచ్చయ్యపేట కూడలి సీసీ రోడ్డు వరకు పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు. ఇప్పిలి సిమ్మన్న, మామిడి శ్రీనివాసరావు, మామిడి శ్రీరాములు, గార రాంబాబు, ఇప్పిలి నరసింగరావు, కొత్త కోట రామి నాయుడు, పలువురు గ్రామస్తులు మంగళవారం మాట్లాడుతూ.. మట్టిరోడ్డు కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రాధాన్యం ఉన్న ఈ రహదారిని తారు రోడ్డుగా మార్చాలని కోరారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి



గాజులకొల్లివలసలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

ఆమదాలవలస రూరల్: మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఏటాఒకే రకమైన పంటలు సాగు చేస్తుండడంతో దిగుబడులు తగ్గిపోతుండడంతో నష్టపోతున్న అన్నదాతలు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. వరి, అపరాలు వంటి పంటలు సాగు చేయడం వల్ల పెట్టుబడులు అధికం కావడం, వర్షాభావంతో దెబ్బతినడం, పెట్టుబడులు చేతికందని దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీన్ని అధిగమించేందుకు మొక్కజొన్న, నువ్వు పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. గాజులకొల్లివలస, జొన్నవలస, బెలమాం, నెల్లిమెట్ట, చింతలపేట, నెల్లిపర్తి, రామచంద్రాపురం, వెదుళ్లవలస, వంజంగి, వంజంగిపేట వంటి గ్రామాల్లో ఎక్కువమంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఎకరా మొక్కజొన్న సాగు చేయాలంటే విత్తనాలు, సేద్యాలు కలుపుకుని రూ. 4 వేలు పెట్టుబడులు అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో కూడా ఆశించినంత దిగుబడులు రావడంతో వచ్చే ఏడాది నుంచి ఎక్కువ విస్తీర్ణంతో సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

తస్మాత్ జాగ్రత్త..!



పశువుల మేత కోసం వరి గడ్డిని నిల్వ చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా దూర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన గ్రాసాన్ని ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. అయితే గడ్డిని తీసుకొని ట్రాక్టర్లు వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనపించకపోవడం, ఇరుగైన రోడ్లు కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రాసంతో ట్రాక్టర్లు వెళ్లేటప్పుడు ప్రజలు, వాహన చోదకులు అప్రమత్తంగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. -బూర్జ

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహనలో విద్యార్థులు

బూర్జ: క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుత్తావల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పావని అన్నారు. జాతీయ క్యాన్సర్ వారోత్సవాల్లో భాగంగా కేకేరాజపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యపానం, ధూమపానం, ఖైనీ, గుట్కా వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అప్పలస్వామి, స్థానిక సర్పంచ్ కె.వెంకటశివసాయి సీతారామరాజు, హెచ్‌ఎం పద్మావతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తూరు: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. లబ్బ గ్రామంలో 12వ వారం పొలబడిని మంగళవారం నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడడం వల్ల భూమిసారం తగ్గుతోందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పంటలు సారవంతమై మెరుగైన దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుధాకర్, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నరసన్నపేట: దేశవానిపేట యూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎం.సురేష్, కె.భార్గవి, కె.కల్యాణి, టి.యామినిలు ఆలిండియా చిల్డ్రన్ ఆర్ట్స్ కాంపిటేషన్‌లో బంగారు పతకాలు సాధించారు. నెల్లూరులోని అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గత నెల 28న ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలను అకాడమి ప్రతినిధులు మంగళవారం పంపించారు. వీటిని విద్యార్థులకు హెచ్‌ఎం ఎం.జె.రావు మంగళవారం ప్రదానం చేశారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషిచేయాలి

- డీఈవో పగడాలమ్మ



ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలిస్తున్న డీఈవో పగడాలమ్మ

నరసన్నపేట: పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని డీఈవో గార పగడాలమ్మ అన్నారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నందున విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. తామరాపల్లి యూపీ పాఠశాలను మంగళవారం సందర్శించారు. అన్ని తరగతులకు వెళ్లి పిల్లలతో మాట్లాడి విద్యా ప్రమాణాలు పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వినియోగం తీరును అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాల బోధన ప్రాణాళికను ఉపాధ్యాయుల నుంచి ఆరా తీశారు. ఆశించిన విధంగా విద్యార్థుల్లో ప్రమాణాల్లేవని మెరుగు పరచాలని ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు.

శివాలయం నిర్మాణానికి రూ. 20 వేల వితరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: శ్యామలాపురం వంశధార పునరావాస కాలనీలో ఉమా మల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన పెద్దకోట రాంప్రసాద్ రూ.20 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు తమవంతుగా సహకారం అందజేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాంప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు బలగ గోవిందరావు, మోహనరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత కలమటకు లేదు

- పార్టీ నాయకులు



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న రెడ్డి రామారావు తదితరులు



పాతపట్నం: మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్యామ్‌సుందరరావు

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే అర్హత పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు లేదని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణలు అన్నారు. చిన్నకొల్లివలసలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జెండాతోనే గెలిచి అసెంబ్లీకి వెళ్లిన విషయం మరిచిపోకూడదన్నారు. 2016లో పార్టీని ఫిరాయించిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ఇసుక మాఫియా, వంశధార నిర్వాసితుల ప్యాకేజీలు బినామీల పేర్లతో స్వాహా చేసుకుని, అధికారం కోసం పార్టీలు ఫిరాయించే మీరు నిజాయితీగా పని చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతిని విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, తలసముద్రం శోభన్‌బాబు, చెట్టు రాము, పొన్నాన ధర్మారావు, రెడ్డి సీతారాం పాల్గొన్నారు.

విమర్శలు తగవు

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి ఆ తరువాత పార్టీ ఫిరాయించిన కలమట వెంకటరమణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరావు, ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్‌లు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండల సలహాదారుడు ఎం.గణపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.చంద్రయ్య, నాయకులు ఎనుగుతల సూర్యం, చీకటి పద్మరాజు, పనుకు మోహన్, ప్రహ్లాద పుల్లాయ్, తూలుగు ప్రవీణ్, నేతాజీ, జి.రాము, సుందరరావు పాల్గొన్నారు.

ఏ పార్టీ తరపున గెలిచారో గుర్తించుకోవాలి

హిరమండలం: మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఏ పార్టీ తరపున శాసనసభకు ఎన్నికయ్యారో గుర్తు తెచ్చుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున గెలిచిన ఆయన స్వార్థ ప్రయోజనం కోసం పార్టీ ఫిరాయించారన్నారు. ఉనికిని కాపాడుకోవటం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శిస్తే సహించేది లేదన్నారు. మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ వి.బాలరాజు, నాయకులు బూర్లె శ్రీనివాసరావు, జి.సురేష్, టి.తాడు, బూర శ్రీనివాసరావు, ఎస్.పాపారావు, శంకర్‌రావు, రవి, జె.శ్రీనివాసరావు ఉన్నారు.

హాస్యాస్పదం..

కొత్తూరు: మాజీ ఎమ్మెల్యే కలమట తమ పార్టీ నాయకులపై లేనిపోని వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కొత్తూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సారిపల్లి ప్రసాద్, స్థానిక సర్పంచ్ పడాల కృష్ణవేణి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును సీబీఐ విచారిస్తుండడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో వణుకు పుడుతోందని కలమట అనడం విడ్డూరంగా ఉందన్నారు. సచివాలయ మండల కన్వీనర్ కామక త్రినాథరావు, గోగుల వరప్రసాదరావు, నాయకులు గండివలస ఆనందరావు, పిన్నింటి రామారావునాయుడు, యడ్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.